# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 12-06-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ అహ్మదాబాద్‌లోని విమాన ప్రమాదంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్రమోదీ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.
- ❖ దేశాన్ని స్వావలంబన దిశగా నడిపించడంలో భారతదేశ యువ ఆవిష్కర్తలు కీలక పాత్ర పోషిస్తున్నారని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పేర్కొన్నారు.
- ❖ "వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ యాత్ర" ఈరోజుతో ముగిసింది.
- ❖ విశాఖలో ఈనెల 21న జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో 40 దేశాల ప్రతినిధులు పాల్గొంటారని కేంద్రమంత్రి ప్రతాప్‌రావ్ జాదవ్ తెలిపారు.

==================

అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయం నుండి ఈరోజు మధ్యాహ్నం లండన్ బయలుదేరిన ఏఐ-171 విమానం ప్రమాదానికి గురైయింది. రన్‌వే నుంచి టేకాఫ్ అయిన కొద్దిసేపటికే మేఘాని నగర్ ప్రాంతంలో విమానం ఒక్కసారిగా కూలిపోవడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదం జరిగిన సమయంలో సిబ్బందితో సహా విమానంలో మొత్తం 242 మంది ప్రయాణికులు ఉన్నారని అధికారులు తెలిపారు.

ఈ ప్రమాద ఘటనపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్రమోదీ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. విమాన ప్రమాదం తనను తీవ్రంగా కలిచివేసిందని, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. ఈ క్లిష్ట సమయంలో దేశం బాధితులకు తోడుగా నిలుస్తుందని రాష్ట్రపతి తెలిపారు. బాధిత కుటుంబాలకు ప్రధానమంత్ర నరేంద్రమోదీ తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. సహాయక చర్యలపై మంత్రులు, సంబంధిత అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని తెలిపారు.

==================

విమాన ప్రమాదంపై పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద ఘటన ప్రాంతాన్ని పరిశీలించిన కేంద్రమంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ... ఈ విషాదం తీవ్రంగా కలిచి వేసిందన్నారు. ప్రమాదంపై లోతైన దర్యాప్తు చేపడతామని రామ్మోహన్ నాయుడు పేర్కొంటూ...

(వాయిస్ 40 సెకన్లు)

===================

విమాన ప్రమాద మృతులపై ప్రస్తుతం ఎటువంటి స్పష్టత ఇవ్వలేమని అహ్మదాబాద్ పోలీస్ కమిషనర్ జీఎస్ మాలిక్ తెలిపారు. విమానం నివాస ప్రాంతంలో కూలినందున మృతుల సంఖ్య ఎక్కువగా ఉండే అవకాశం ఉందని వెల్లడించారు. ఈ విమాన ప్రమాదం నుండి ఒకరు బయట పడ్డారని, అతనికి ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నామని తెలియజేశారు.

===================

భారతదేశ యువ ఆవిష్కర్తలు సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయడంలో.. దేశాన్ని స్వావలంబన దిశగా నడిపించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పేర్కొన్నారు. ఇది ప్రపంచ సాంకేతిక శక్తి కేంద్రంగా భారతదేశ స్థానాన్ని మరింత బలోపేతం చేసిందన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని గత 11 సంవత్సరాలలో ప్రజలు అపరిమిత ప్రయోజనాలు పొందారని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ప్రధానమంత్రి పేర్కొన్నారు. చివరి లబ్ధిదారుడికి కూడా సకాలంలో పథకాలు చేరాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సేవలను అత్యంత ఖచ్చితత్వంతో పారదర్శకంగా అందించేందుకు సాంకేతికత దోహదం చేస్తోందని తెలిపారు. అంతేకాకుండా పేదల జీవితాలను మెరుగుపరిచే సాధనంగా మారిందన్నారు.

===================

ప్రపంచానికి ఆహార ఉత్పత్తి కేంద్రంగా భారతదేశాన్ని మార్చాలనేది ప్రభుత్వ సంకల్పమని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. "వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్" ముగింపు సందర్భంగా గుజరాత్‌లోని బార్డోలిలో ఈరోజు జరిగిన రైతుల సమావేశంలో కేంద్రమంత్రి మాట్లాడుతూ... అభివృద్ధి చెందిన భారతదేశం దార్శనికతను సాధించడంలో వ్యవసాయం కీలక పాత్ర పోషిస్తుందన్నారు. వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ యాత్ర శాస్త్రీయ పరిశోధన, పురాతన వ్యవసాయం మధ్య అంతరాన్ని తగ్గించిందని పేర్కొన్నారు. లాభదాయకమైన, ఎగుమతి ఆధారిత వ్యవసాయ రంగానికి మార్గం సుగమం చేసిందన్నారు. భారతదేశ వ్యవసాయ పునరుజ్జీవనం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తుందని శివరాజ్ సింగ్ చౌహాన్ పేర్కొంటూ....

(వాయిస్ 40 సెకన్లు)

విరామం

===================

ఉగ్రవాదంపై పోరాటంలో మద్దతు ఇస్తున్న ఫ్రాన్స్ దేశానికి భారత విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్ జైశంకర్ కృతజ్ఞతలు తెలిపారు. ఐరోపా దేశాల పర్యటనలో భాగంగా జైశంకర్ ఈరోజు ఫ్రెంచ్ అధ్యక్షులు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్‌తో సమావేశమయ్యానని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఈ భేటీలో జరిగిన చర్చలు భారత్ -ఫ్రాన్స్ దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్య ఆశయాన్ని ప్రతిబింబిస్తాయని జైశంకర్ పేర్కొన్నారు.

===================

ప్రపంచ వ్యాప్తంగా యోగా ఒక సామూహిక ఉద్యమంగా పరిణామం చెందిందని కేంద్ర ఆయుష్ శాఖ మంత్రి ప్రతాపరావు జాదవ్ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవంపై కేంద్రమంత్రి ఈరోజు న్యూఢిల్లీలో పాత్రికేయులతో మాట్లాడుతూ... ఒకే భూమి, ఒకే ఆరోగ్యం నినాదంతో ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో జరిగే ఈ కార్యక్రమంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పాల్గొంటారని, అలాగే దాదాపు 40 దేశాల ప్రతినిధులు యోగా దినోత్సవంలో పాల్గొంటారని ఆయన వెల్లడిస్తూ..

(వాయిస్ 39 సెకన్లు)

===================

దేశంలో హస్త కళల ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు కేంద్రప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోందని కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. ఈరోజు న్యూఢిల్లీలోని రాజ్ ఘాట్‌లో లోక్ సంవర్ధన్ పర్వ్‌ను కేంద్రమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... గ్రామాల్లోని కార్మికులు ప్రతిభతో తయారు చేసిన సాంప్రదాయ హస్తకళలను మార్కెట్‌కు తీసుకురావడానికి ఇది మంచి వేదిక అన్నారు. వివిధ రాష్ట్రాలలో తయారు చేసిన ఉత్పత్తులను తరలించడానికి కూడా ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. 4 రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో సబ్‌కా సాథ్.. సబ్‌కా వికాస్... సబ్‌కా విశ్వాస్.. సబ్‌కా ప్రయాస్... దార్శనికత కింద ప్రభుత్వ కీలక పథకాలు, కార్యక్రమాలను, విజయాలను కూడా ప్రదర్శిస్తారని వెల్లడించారు.

===================

ప్రపంచంలోని ఎత్తైన ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన నేషనల్ క్యాడెట్ కోర్ యువ తరానికి స్ఫూర్తిదాయకంగా నిలిచారని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఇటీవల ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన వారిని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈరోజు న్యూఢిల్లీలో సత్కరించారు. ఈ సందర్భంగా NCC తన క్యాడెట్లను ఈ శిఖరాగ్రానికి పంపాలన్న నిర్ణయాన్ని కేంద్రమంత్రి ప్రశంసించారు. ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించేటప్పుడు వారు ప్రదర్శించిన ధైర్యం, దృఢ సంకల్పంతో భవిష్యత్ సవాళ్లను అధిరోహిస్తారని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. కాగా 19 సంవత్సరాల వయస్సు గల ఐదుగురు బాలికలు, ఐదుగురు బాలురులతో కూడిన NCC బృందం గత నెల 18న ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించింది.

===================

త్వరలో ప్రారంభం కానున్న ప్రసిద్ధ అమర్‌నాథ్ యాత్రకు ఇప్పటివరకు 3.31 లక్షల మంది పేర్లు నమోదు చేసుకున్నారని జమ్ముకశ్మీర్ అధికారులు వెల్లడించారు. ఈ సంవత్సరం జులై 3న అమర్‌నాథ్ యాత్ర ప్రారంభమై ఆగస్టు 9వ తేదీన ముగుస్తుంది. అమర్‌నాథ్ గుహకు చేరుకోవాలంటే 45 కిలోమీటర్ల మేర ట్రెక్కింగ్ చేస్తూ... వెళ్లవలసి ఉంటుంది.

===================

లండన్లో ని లార్డ్స్ వేదికగా జరుగుతున్న డబ్ల్యూటీసీ ఫైనల్ (WTC Final) మ్యాచ్  దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 138 పరుగులకు ఆలౌటైంది. 43 పరుగులకు 4 వికెట్ల నష్టంతో రెండవ రోజు ఆటను ప్రారంభించిన సౌతాఫ్రికా.. బెడింగ్‌హామ్ 45, బౌవుమా 36 పరుగులతో రాణించడంతో మొదటి ఇన్నింగ్స్‌లో 138 పరుగులు చేయగలిగింది. అంతకుముందు ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 212 పరుగులకు ఆలౌట్ అవ్వడంతో 74 పరుగుల ఆధిక్యం లభించింది.

===================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈ రోజు భారీ నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 82,515 పాయింట్ల వద్ద ప్రారంభమై... చివరకు 823 పాయింట్ల నష్టంతో 81,692 వద్ద స్థిరపడింది. నిఫ్టీ చివరకు 253 పాయింట్ల నష్టంతో 24,888 వద్ద ముగిసింది.

===================

===================